క్లుప్తంగా

డిజిటల్ కార్డుల సర్వే పరిశీలన



సర్వేను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కనకయ్య, చైర్మన్ డీవీ, అధికారులు

ఇల్లెందు: పట్టణంలోని 23వ వార్డులో డిజిటల్ కార్డుల సర్వేను ఎమ్మెల్యే కోరం కనకయ్య, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, వైస్ చైర్మన్ జానీపాషా, కమిషనర్ యాదగిరి తదితరులు పరిశీలించారు. గురువారం వినోభానగర్ కాలనీలో సర్వే బృందాలు ఇంటింటి సర్వే చేపట్టాయి. ప్రభుత్వం అందజేసిన సమాచారం ఆధారంగా సర్వే బృందం ఇంటి వద్దకే వెళ్లి ఇంటి యజమాని, కుటుంబ సభ్యులు వివరాలు నమోదు చేసుకున్నారు.

రెజ్లింగ్‌లో రాణించాలి..



ఆయాన్‌ను అభినందిస్తున్న డీఎస్పీ రెహమాన్

కొత్తగూడెంటౌన్: రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించి జిల్లాకు మంచిపేరు తీసుకురావాలని కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ అన్నారు. గురువారం డీఎస్పీ కార్యాలయంలో రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో పాల్గొననున్న క్రీడాకారుడు ఎంఏ ఆయాన్, జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.కాశీహుస్సేన్ ఆయనను కలిశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడారు. రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించి జిల్లాకు పతకాలు తీసుకురావాలని ఆకాంక్షించారు. జిల్లా తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఇ.మొగిలి, అసోసియేషన్ సభ్యులు ఎంఏ సాజిద్ తదితరులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలి

టేకులపల్లి: ఎస్సీ వర్గీకరణ విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయకుండా ఉద్యోగ నియామకాలు చేస్తున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ నల్లగట్ల వెంకన్న గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మాల, మాదిగలు రెండు కళ్లు అని చెప్పిన కాంగ్రెస్ నాయకులు ఎస్సీ వర్గీకరణ విషయంలో ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రశ్నించారు. వర్గీకరణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ ఈనెల 9న అన్ని జిల్లా కేంద్రాల్లో అంబేద్కర్ విగ్రహం నుంచి కలెక్టరేట్ వరకు నల్లజెండాలతో నిరసన ర్యాలీ ఉంటుందని, 15న హైదరాబాద్‌లో భారీ సదస్సు ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ సదస్సులో రేవంత్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేపట్టబోయే ఉద్యమ కార్యాచరణ రూపొందించడం జరుగుందని తెలిపారు.

న్యాయవాదిపై పోలీసుల దాడి గర్హనీయం..



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

కొత్తగూడెంటౌన్: మాదన్నపేటపేట సిటీ సివిల్ కోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్న ఖలీల్‌పై దాడి చేసిన పోలీసులను కఠినంగా శిక్షించాలని గురువారం కొత్తగూడెం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ఎదుట న్యాయవాదులు నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు తోటమల్లేశ్వరావు, ఎంఎస్ఆర్ రవిచంద్ర, దూదిపాల రవికుమార్‌లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

వరి పంట పరిశీలన



వరిని పరిశీలిస్తున్న ఏఓ

సుజాతనగర్: సుజాతనగర్‌లో రైతులు సాగు చేసిన వరి పంట పొలాలను వ్యవసాయశాఖాధికారి జి.నర్మద అధ్వర్యంలో గురువారం పరిశీలించారు. రైతులు సాగు చేసిన ఎంటీయూ 1262 రకం 160 రోజుల్లో పంట రావాల్సి ఉండగా...100 రోజుల్లోనే కంకి రావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని ఆమె తెలిపారు. పంటల పరిశీలన నిమిత్తం రావాలని వ్యవసాయశాస్త్రవేత్తలను, ఉన్నతాధికారులను కోరానని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతులు నల్లగోపు పుల్లయ్య, మహబూబ్ అలీ, గడ్డం లక్ష్మణరావు, మౌలాలి, బడే బాబు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీదేవీ శరన్నవరాత్రి

ఉత్సవాలు ప్రారంభం

- ప్రత్యేక మండపాల్లో కొలువుదీరిన అమ్మవారు
- తొలిరోజు శ్రీబాలాత్రిపుర సుందరిగా భక్తులకు దర్శనం



ఇల్లెందు: ఇందిరానగర్ మండపంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కనకయ్య, చైర్మన్ డీవీ తదితరులు

ఇల్లెందు: ఇల్లెందు పట్టణంలో శ్రీ దేవీశరన్నవరాత్రోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలోని పలు ఏరియాల్లో ఏర్పాటు చేసిన మండపాల్లో ఆశీనులైన దుర్గాదేవీ మాతకు తొలిరోజు శ్రీబాలాత్రిపుర సుందరి అలంకరణలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండపాల్లో ఎమ్మెల్యే కోరం కనకయ్య సతీమణి లక్ష్మి, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు సతీమణి బేబీ భార్గవి, వైస్ చైర్మన్ జానీపాషా, కౌన్సిలర్లు ప్రత్యేక పూజలో పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: మండలంలోని పలు గ్రామాలలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. సుభాష్‌నగర్, ఇందిరానగర్, కొమరారం, పోలారం గ్రామాలలో భక్తులు ప్రత్యేకంగా చలువ పందిళ్లు నిర్మించి దుర్గామాత అమ్మవారి విగ్రహాలను ప్రతిష్ఠించారు. తొలిరోజు బాలాత్రిపురసుందరి అవతారంలో దర్శనమిచ్చిన అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పలువురు అమ్మవారి మాల ధరించి పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు.

టేకులపల్లి: దేవీశరన్నవరాత్రి వేడుకలు గురువారం ఘనంగా ప్రారంభం అయ్యాయి. రామాలయం, వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ వీధి, బోడు తదితర గ్రామాల్లో అమ్మవారి విగ్రహాలను ప్రత్యేక మండపాల్లో ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు.

కొత్తగూడెంటౌన్: శ్రీదేవి శరన్నవరాత్రుల మహోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఆలయల్లో అమ్మవారికి, మండపాల్లో కొలువుదీరిన అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొత్తగూడెం శ్రీవిజయ విఘ్నేశ్వరస్వామి దేవస్థానం (గణేష్‌టెంపుల్)లో మొదటిరోజు శ్రీబాల త్రిపుర సుందరీ అవతారంలో భక్తులక దర్శనమిచ్చారు.



కొత్తగూడెంటౌన్: గణేష్ టెంపుల్‌లో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు



రామవరంలో..

పాల్వంచ: శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలో ఏర్పాటు చేసిన పలు మండపాల్లో గురువారం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాత పాల్వంచ మైసమ్మ తల్లి, సంజయ్‌నగర్ మహాలక్ష్మి దేవాలయం, జ్యోతినగర్ అమ్మవారి దేవాలయం, బొల్లేరుగూడెం లలిత కామేశ్వరి దేవాలయం, రామాలయంలో, చాకలి బజార్‌లోని మండపాల వద్ద డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు పూజలు నిర్వహించారు. జ్యోతినగర్ శ్రీ కనకదుర్గ అభయాంజనేయ స్వామి దేవాలయం వద్ద చైర్మన్ వనమా రాఘువేందర్‌రావు, పద్మావతి దంపతులు పూజలు నిర్వహించారు.

జూలూరుపాడు: మండలంలో పలు గ్రామాల్లో శ్రీదేవీ శరన్నవరాత్రుల మహోత్సవాలు వైభవంగా గురువారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయాలు, మండపాల్లో శ్రీదేవీ అమ్మవారి (ప్రతిమలు)విగ్రహాలు కొలువుదీరాయి. పాపకొల్లు గ్రామంలోని శ్రీఉమాసోమలింగేశ్వరాలయం, శ్రీపెద్దమ్మతల్లి ఆలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక మండపాల్లో శ్రీదేవీ నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. జూలూరుపాడు, సురారం శ్రీసీతారామాలయాల్లో, వెంగన్నపాలెం, గుండెపుడి శ్రీఅభయాంజనేయస్వామి ఆలయాల్లోను, వెంగన్నపాలెం టీచర్స్ కాలనీ, కాకర్ల, తదితర గ్రామాల్లో మొదటి రోజు శ్రీదేవీ అమ్మవారు వేర్వేరు రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. అదే విధంగా కొమ్ముగూడెం శ్రీపెద్దమ్మతల్లి ఆలయంలో శ్రీదేవీ నవరాత్రి ఉత్సవాలు కనుల పండుగగా ప్రారంభమయ్యాయి.



పాల్వంచ: పూజలు నిర్వహిస్తున్న డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు



ఇల్లెందురూరల్: సుభాష్‌నగర్‌లో...



టేకులపల్లి రామాలయంలో..





జూలూరుపాడు: కాకర్లలో అమ్మవారికి ప్రత్యేక పూజలు.., పాపకొల్లు శ్రీకోటమైసమ్మ తల్లి ఆలయంలో..

చెరువుల ఆక్రమణలను అడ్డుకుంటాం..



చెరువును పరిశీలిస్తున్న ఇరిగేషన్ డీఈ కిషోర్

జూలూరుపాడు: చెరువుల ఆక్రమణలను అరికడతామని జూలూరుపాడు, ఏన్కూరు మండలాల ఇరిగేషన్ డీఈ కిషోర్ అన్నారు. మాలమహానాడు మండల కమిటీ ఆధ్వర్యంలో విప్పజాలకుంట చెరువు ఆక్రమణలను అరికట్టాలని కోరుతూ ప్రజావాణిలో కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌కు వినతిపత్రం అందజేసిన నేపథ్యంలో గురువారం చెరువును డీఈ కిషోర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జూలూరుపాడు, గుండెపుడి రెవెన్యూ పరిధిల్లో 60, 69 సర్వే నంబర్లలోని విప్పజాల కుంట(ఎర్ర) చెరువు 40 ఎకరాల విస్తీర్ణంలో ఉందని, ఇది ఆక్రమణకు గురయిందని ఫిర్యాదు రావడంతో పరిశీలించినట్లు చెప్పారు. ఇరిగేషన్, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో జాయింట్ సర్వే చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బుడిపూడి ప్రభాకర్, ఇల్లంగి తిరుపతి, పణితి వెంకటేశ్వర్లు, పోతురాజు రామారావు, కళ్లోజి రవికాంత్, బుడిపూడి ప్రతాప్, ఇల్లంగి సుందర్‌రావు, మైపు శ్రీను, పప్పుల నరసింహారావు, పత్తిపాటి యోహాన్, తదితరులు పాల్గొన్నారు.

టీపీఎఫ్ ఆవిర్భావ సదస్సును జయప్రదం చేయండి

టేకులపల్లి: ప్రజాస్వామిక తెలంగాణ కోసం నిత్యం పోరాడుతున్న తెలంగాణ ప్రజా ఫ్రంట్ 15వ ఆవిర్భావ రాష్ట్ర స్థాయి సదస్సు ఈనెల 9న సుందరయ్య విజ్ఞాన కేంద్రం హైదరాబాద్‌లో జరగనుందని ప్రజాస్వామ్య తెలంగాణ వాదులు అధిక సంఖ్యలో హాజరు కావాలని టీపీఎఫ్ జిల్లా నాయకుడు ఎట్టి ప్రశాంత్ పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం టేకులపల్లిలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడారు.

అనుమతులు రద్దు చేయండి..

పాల్వంచరూరల్: తోగ్గూడెం పంచాయతీలోని 1/70 చట్టం ఉన్న ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు పొందినవారు క్వారీలో బాంబులు పేల్చడం వలన కాలుష్యం వెదజల్లుతోందని, ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని, పంటలకు ప్రమాదకర పరిస్థితులు ఏర్పడుతున్నాయని అనుమతులు రద్దు చేయాలని కోరుతూ సేవలాల్ సేన జిల్లా అధ్యక్షుడు శివనాయక్ గురువారం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. క్వారీల్లో బ్లాస్టింగ్‌తోపాటు, వాహనాల రాకపోకల కారణంగా దుమ్ము ధూళితో స్థానికులు ఇబ్బంది పడుతున్నారని విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభం

సుజాతనగర్: గ్రామీణ మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు ప్రభుత్వం వారికి ప్రోత్సాహకాలు అందిస్తోందని ఏపీజీవీబీ మేనేజర్ నరేష్ అన్నారు. ఇందిరా మహిళా శక్తిలో భాగంగా వేపలగడ్డ గ్రామానికి చెందిన డ్వాక్రా సభ్యురాలు సోయం జయలక్ష్మి ఏర్పాటు చేసిన క్యాంటీన్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. మాట్లాడుతూ.. మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతున్నారు. మహిళా సంఘాల సభ్యులకు ప్రభుత్వం అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జీరా రైస్, లెమన్ రైస్, పుదీనా రైస్, టమాట రైస్‌లను రూ.30, ఆర్డర్లపై భోజనం తయారు చేయనున్నట్లు నిర్వాహకురాలు తెలిపారు. కార్యక్రమంలో సెర్ప్ సీసీలు శిరీష, శ్రీలక్ష్మి, వీఓఏలు పద్మ, మాధవి, నిర్మల, బ్యాంకు సిబ్బంది అశోక్, పృథ్వీ, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న మేనేజర్ నరేష్

మంత్రి సురేఖ వ్యాఖ్యలు సరికాదు..



మంత్రి కొండా సురేఖ ఫ్లెక్సీతో నిరసన తెలుపుతున్న నాయకురాళ్లు

ఇల్లెందు: తెలంగాణలో సీఎం రేవంత్‌రెడ్డి మంత్రివర్గం హద్దు మీరి ప్రవర్తిస్తోందని, ఓ మహిళా మంత్రి సాటి మహిళ పట్ల అమానుషంగా మాట్లాడటం కాంగ్రెస్ ప్రభుత్వానికే చెల్లిందని, మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలు సిగ్గు సిగ్గు అంటూ బీఆర్ఎస్ మహిళా విభాగం మండిపడింది. గురువారం ఇల్లెందు తెలంగాణ తల్లి విగ్రహం వద్ద బీఆర్ఎస్ మహిళా నేతలు మంత్రి కొండా సురేఖ ఫ్లెక్సీని దహనం చేశారు. మహిళా విభాగం పట్టణ అధ్యక్షురాలు నెమలి ధనమ్మ, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి ఖమ్మంపాటి రేణుక మాట్లాడుతూ... గౌరవప్రదమైన మంత్రి పదవిలో ఉండి రాజకీయాలకు సంబంధం లేని ఓ మహిళపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సురేఖకే చెల్లిందన్నారు.

తెలుగు సినీ పరిశ్రమలో గౌరవ ప్రదమైన ఉన్నత కుటుంబంలో ఉన్న అక్కినేని కుటుంబాన్ని రోడ్డుపైకి లాగటం దుర్మార్గం అన్నారు. హద్దు మీరి వ్యవహరించిన మంత్రి సురేఖను కాంగ్రెస్ ప్రభుత్వం మంత్రివర్గం నుంచి తొలిగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కొక్కు సరిత, చంద్రావతి, కౌన్సిలర్లు కటకం పద్మావతి, సందా బిందు, పిలివేరు అనిత, చీమల సుజాత, పాబోలు స్వాతి, కడగల నారాయణమ్మ, పూనెం కమల తదితరులు పాల్గొన్నారు.

నేడు దుకాణాలకు వేలంపాట

పాల్వంచరూరల్: శ్రీకనకదుర్గ(పెద్దమ్మతల్లి) ఆలయంలోని పాతకాంప్లెక్స్‌లోని 3వ నంబర్ షాపుకు 11 నెలల కాలపరిమితి, కొత్త కాంప్లెక్స్‌లోని 11వ నంబర్ షాపుకు 3 సంవత్సరాల కాలపరిమితి లీజుకు, పోగుచేసిన చీరలు, పూలదండలు ఆలయ ప్రాంగణంలో విక్రయించుకునేందుకు, 3 షెట్టర్ రూమ్‌లను తొలగించేందుకు టెండర్ కం బహిరంగ వేలంపాట శుక్రవారం నిర్వహించనున్నట్లు ఈఓ ఎన్.రజనీకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల వరకు రూ.200 చెల్లించి దేవస్థానం కార్యాలయంలో షెడ్యూల్డ్ పొందవచ్చన్నారు. డీడీని జతపరిచి టెండర్ వేసి బహిరంగ వేలంపాటలో పాల్గొనాలని పేర్కొన్నారు.

సింగరేణిలో శుభ్రత.. పరిశుభ్రత



పరిసరాలను శుభ్రం చేస్తున్న జీఎం శాలేంరాజు, ఉద్యోగులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియాలో పరిధిలోని క్వార్టర్లలో బుధవారం స్పెషల్ కాంపెయిన్ 4.0 రెండో దశ కార్యక్రమాన్ని ఏరియా జీఎం ఎం.శాలేంరాజు ప్రారంభించారు. మాట్లాడుతూ.. సెక్రటరీ మినిస్ట్రీ ఆఫ్ కోల్ ఆదేశానుసారం సింగరేణి వ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా గనులు, డిపార్ట్‌మెంట్లు, ఆఫీసుల్లో, పరిసరాల్లో, పరిశుభ్రత కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కార్మికులు, ఉద్యోగులు పరిసరాల్లో చెత్తను ఏరోజుకు ఆరోజు శుభ్రం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్, వీరయ్య, ఎస్‌ఓటూ జీఎం కోటిరెడ్డి, ఏజీఎం సివిల్ రామకృష్ణ, డీజీఎం పర్సనల్ కేశవరావు, సదానందం, ఎస్. యోహాన్, మురళి, అచ్యుతరామయ్య, ఎం.మురళీ, తావుర్యా సాగర్ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆశయాలు సాధించాలి



అంబేద్కర్ చిత్రపటంతో పార్టీ నాయకులు

కొత్తగూడెంఅర్బన్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయ సాధన కోసం కృషి చేయాలని ఆర్‌పీఐ పార్టీ జిల్లా అధ్యక్షుడు కోటా శివశంకర్ అన్నారు. గురువారం రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా ఆవిర్భావ దినోత్సవాన్ని కొత్తగూడెంలో నిర్వహించారు. మాట్లాడుతూ... అణగారిన ప్రజల హక్కుల కోసం ఒక పార్టీ ఉండాలని, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాల ప్రజలు అగ్రవర్ణ పార్టీలకు ఊడిగం చేయొద్దని, ఓటు మన రాజ్యం అనే నినాదంతో రాజ్యాధికారం కోసం అంబేద్కర్ మరణాంతరం అంబేద్కర్ అనుచరులు ఆర్‌పీఐ పార్టీని స్థాపించినట్లు చెప్పారు. ఆ పార్టీ విజయవంతంగా 67 సంవత్సరాలు పూర్తి చేసుకుందన్నారు. మహిళలు, యువకులు, పెద్ద ఎత్తున పార్టీలో చేరి, అంబేద్కర్ ఆశయ సాధన కోసం, సమ సమాజ నిర్మాణం కోసం కృషి చేయాలన్నారు. పార్టీలో సభ్యత్వం తీసుకొని పార్టీని బలోపేతం చేసి అభివృద్ధికి కృషి చేయాలన్నారు.

తాగునీటి సహాయకులకు శిక్షణ



నీటి నాణ్యతను పరిక్షించే విధానాన్ని వివరిస్తున్న టీఓటీలు

జూలూరుపాడు: మిషన్ భగీరథ ఆధ్వర్యంలో గ్రామ మంచినీటి సహాయకులకు నాలుగు రోజులు జరగనున్న శిక్షణ తరగతులు గురువారం మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ట్రైనర్స్ ఆఫ్ ట్రైన్ (టీఓటీ)లు రామకృష్ణ, నజీర్‌లు నీటి నాణ్యత పరీక్షించడం, గుర్తించడం, ట్యాంకుల క్లోరినేషన్, భూగర్భ జలాల్లో కెమికల్స్ గుర్తించడం, ట్యాంకు, చేతి పంపుల వద్ద మురుగు నీరు నిల్వ వల్ల బ్యాక్టీరియా ఎలా తయారు అవుతుందనే అంశాలపై అవగాహన కల్పించారు.

నీటి నాణ్యతను పరిక్షించే విధానాన్ని ప్రయోగపూర్వకంగా చూపించారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ(ఇంట్రావిలేజ్) డీఈ ఎం.శివయ్య, ఏఈ వెంకటస్వామి, ఎంపీడీఓ డి.కరుణాకర్‌రెడ్డి, ఎంపీఓ తులసీరామ్ పాల్గొన్నారు.

వెన్నెలనగర్ వాసుల పోరు పాదయాత్ర



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న బాధితులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): పాతకొత్తగూడెం వెన్నెలనగర్‌లో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ గురువారం వెన్నెలనగర్ నుంచి కలెక్టరేట్ వరకు పోరు పాదయాత్ర నిర్వహించారు. మొదట కొత్తగూడెం మున్సిపాలిటీ వరకు చేరుకున్న అనంతరం తమ సమస్యలను పరిష్కరించాలని చేతులెత్తి నమస్కరించి తిరిగి ప్రదర్శనంగా పోస్టాఫీస్ సెంటర్‌కు చేరుకుని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. అక్కడి నుంచి బస్టాండ్ సెంటర్, రైల్వేస్టేషన్, గణేష్‌టెంపుల్, పాత బస్‌డిపో, లక్ష్మీదేవిపల్లి మీదుగా ఇల్లెందు క్రాస్ నుంచి కలెక్టరేట్‌కు చేరుకున్నారు. ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సేవ్ కొత్తగూడెం, సేవ్ మున్సిపాలిటీ కన్వీనర్ జలాల్ మాట్లాడుతూ... వెన్నెలనగర్‌కు తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పించడంతోపాటు మొదటి విడతలో ఎలాంటి షరతులు లేకుండా 807 మందికి ఇళ్ల నిర్మాణానికి ఒక్కొరికి రూ.5లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రెవెన్యూ మున్సిపల్ అధికారులు, మున్సిపల్ పాలకవర్గం డబుల్‌బెడ్ రూం లబ్ధిదారులను నిండా ముంచారని ఆరోపించారు. ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సమస్యలపై స్పందించాలని డిమాండ్ చేశారు.

తాగునీటి సౌకర్యం కోరుతూ ధర్నా

ఇల్లెందురూరల్: తిలక్‌నగర్ గ్రామపంచాయతీ జెడ్పీ మోడల్ కాలనీలో తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో గురువారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట స్థానికులు ధర్నా చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీఓ కార్యాలయ సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకుడు అబ్దుల్ నబీ మాట్లాడుతూ.. జెడ్పీ మోడల్ కాలనీలో నీటి సౌకర్యం కోసం స్థానిక అధికారులను ప్రశ్నిస్తే నిర్లక్ష్యంగా సమాధానం చెపుతున్నారని, నిరసనగా తిలక్‌నగర్‌లో రాస్తారోకో చేసినప్పటికీ సమస్యకు పరిష్కారం చూపలేదన్నారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు ధర్నా చేస్తున్నట్లు చెప్పారు. అధికారులు తక్షణం స్పందించి తాగునీటి సౌకర్యం కల్పించాలని లేదంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సుల్తానా, భాగ్యలక్ష్మి, రోజా, శ్రీను, శ్రీకాంత్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఊరూరా బతుకమ్మ సంబురాలు



అనంతారంలో..

జూలూరుపాడు: పలు గ్రామాల్లో మహిళలు, యువతులు బతుకమ్మ వేడుకలను ఘనంగా జరుపుకుంటున్నారు. రెండోరోజు గురువారం రంగురంగుపూలతో అటుకుల బతుకమ్మలను పేర్చి ప్రత్యేక పూజలు చేశారు. కూడళ్లల్లో బతుకమ్మల చుట్టూ తిరుగుతూ ఆడిపాడారు. అనంతరం బతుకమ్మలను ఆయా గ్రామాల సమీపంలోని వాగులు, చెరువుల్లో నిమజ్జనం చేశారు.



కరివారిగూడెంలో బతుకమ్మ ఆడుతున్న దృశ్యం



వెంగన్నపాలెం శ్రీదత్త నగర్‌లో..



జూలూరుపాడు న్యూకాలనీలో బతుకమ్మలను పూజిస్తున్న మహిళలు